జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 43 23-2-2026 వెల: రూ.2/- పేజీలు: 06

విలేకరులు కావలెను
జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్,
తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.

# నీటి హక్కులపై రాజీ ప్రసక్తే లేదు

- తెలంగాణ ప్రయోజనాలపై రాజీపడేది లేదన్న సీఎం రేవంత్
- నీటి సమస్యలపై అసెంబ్లీలో చర్చకు రావాలని కేసీఆర్‌కు సూచన
- కాళేశ్వరం ప్రాజెక్టును వృథాగా పోనివ్వమని స్పష్టం
- రెండేళ్లలో పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని హామీ
- దేవాదుల భూసేకరణకు రూ. 600 కోట్లు కేటాయిస్తామని ప్రకటన

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు నదీ జలాలను మళ్లించేందుకు తాను మద్దతిస్తున్నానంటూ చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర నీటి హక్కుల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని ఉద్ఘాటించారు. ఆదివారం ములుగు జిల్లాలో దేవాదుల ప్రాజెక్టుపై జరిగిన సమీక్షా సమావేశంలో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. నీటి సమస్యలపై చౌకబారు ఆరోపణలు చేస్తూ ప్రజలకు సంబంధించిన అంశాలను రాజకీయం చేయవద్దని బీఆర్ఎస్ నేతలకు హితవు పలికారు. అవసరమైతే తాము పొరుగు రాష్ట్రాలతో చర్చిస్తామని, కానీ తెలంగాణ ప్రయోజనాలను కాపాడటంలో వెనకడుగు వేయబోమని అన్నారు. గోదావరి జలాల



## ఆ సదస్సు టర్నింగ్ పాయింట్

- ఏఐ రంగంలో భారత్ అద్భుత విజయాలు
- వాటిని చూసి అధినేతలు ఆశ్చర్యపోయారు
- 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ



2లో



## స్నేహితుడే సూత్రధారి!

- రచయిత బొగ్గుల శ్రీనివాస్ మృతి కేసును ఛేదించిన పోలీసులు
- ఆర్థిక వివాదాలతో స్నేహితుడే కిరాయి ఇచ్చి హత్య చేయించినట్టు నిర్ధారణ
- ప్రమాదంగా చిత్రీకరించేందుకు మృతదేహంతో కారును పోలేరు జలాశయంలోకి తోసివేత
- ప్రధాన నిందితుడైన స్నేహితుడితో పాటు ముగ్గురు కిరాయి హంతకుల అరెస్ట్

2లో


# ఏపీలో భారత్‌నెట్ విస్తరణ

- ఏపీలో భారత్‌నెట్ విస్తరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఒప్పందం
- ప్రాజెక్టు అమలుకు రూ. 2,432 కోట్లు విడుదల చేయనున్న కేంద్రం
- సుమారు 5 లక్షల గ్రామీణ గృహాలకు హైస్పీడ్ ఇంటర్నెట్ కనెక్షన్లు
- రాష్ట్రవ్యాప్తంగా 13,426 గ్రామ పంచాయతీల్లో ప్రాజెక్టు అమలు
- ఏపీ భారత్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (APBIL) ఆధ్వర్యంలో పనులు




ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ సేవలను విస్తరించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలక ముందడుగు వేశాయి. అమెండెడ్ భారత్‌నెట్ ప్రాజెక్ట్ (ABP)ను రాష్ట్రంలో సమర్థంగా అమలు చేసేందుకు ఇరు ప్రభుత్వాల మధ్య ఒక ముఖ్యమైన సహకార ఒప్పందం (MoC) కుదిరింది.

- మిగతా 2వ పేజీలో



2లో

## జమ్మూలో ఎన్‌కౌంటర్.. ముగ్గురు టెర్రరిస్టులు హతం

జమ్మూకశ్మీర్‌లోని కిష్వార్తా జిల్లాలోని మారుమూల ప్రాంతంలో భద్రతా బలగాలకు తీవ్రవాదులకు మధ్య కాల్పులు జరిగాయి. సైన్యం జరిపిన కౌంటర్ టెర్రర్ ఆపరేషన్‌లో ముగ్గుర ఉగ్రవాదులు హతమయినట్లు తెలుస్తోంది. జమ్మూలోని. మృతిచెందిన ఉగ్రవాదులు పాకిస్థాన్‌లోని జైష్-ఎ-మహమ్మద్ ఉగ్రసంస్థతో సంబంధం ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే మృతిచెందిన ఉగ్రవాదుల నుండి ఏకే-47 రైఫిల్స్‌తో పాటు మందుగుండు సామాగ్రి స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.



2లో

## లడ్డూ వ్యవహారంలో డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడుతున్నారు

- లడ్డూ వివాదంలో ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని వైసీపీ ఆరోపణ
- ఏకసభ్య కమిటీ వేయడం సుప్రీంకోర్టును అవమానించడమేనన్న భూమన
- తప్పుడు ప్రచారాన్ని కప్పిపుచ్చుకునేందుకే ఈ కమిటీ అని విమర్శ



2లో

## ఉద్రిక్తంగా 'చలో కామారెడ్డి'

- రాంచందర్‌రావును అరెస్టు చేస్తున్న పోలీసులు
- బీజేపీ ముఖ్యనేతల ఇళ్ల వద్ద పోలీసుల మోహరింపు
- రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అరెస్టు... బొల్లారం పీఎస్‌కు తరలింపు
- పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల హౌస్ అరెస్టు
- పోలీసులు, ప్రభుత్వ వైఖరిపై కమలనాథుల ఆగ్రహం

2లో

# లొంగిపోయిన దేవ్‌జీ!

- రాజిరెడ్డి సహా 16 మందితో కలిసి ఆయుధాలు వీడిన మావో అగ్రనేత
- కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎస్ఐబీ పోలీసుల ఎదుట లొంగుబాటు
- దీనిపై తమకు సమాచారం ఉందన్న ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం
- ఇంకా ధ్రువీకరించని తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులు..
- కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్ లక్ష్యం ఇక నెరవేరినట్లేనని చర్చ





కోరుట్ల: మావోయిస్టు పార్టీ అగ్రనేత, నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ తర్వాత ఆ పార్టీకి నాయకత్వం వహిస్తున్న తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ ఎట్టకేలకు అజ్ఞాతం వీడినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయన కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎస్ఐబీ పోలీసుల ఎదుట లొంగిపోయారని విశ్వసనీయ సమాచారం. ఆయనతోపాటు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ సహా 16 మంది సహచరులు లొంగిపోయినట్లు తెలిసింది.

- మిగతా 2వ పేజీలో

# లడ్డూ వ్యవహారంలో డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడుతున్నారు

తిరుపతి లడ్డూ వివాదంలో తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని, దారి మళ్లింపు రాజకీయాలకు పాల్పడుతోందని వైసీపీ విమర్శించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అబద్ధాలను, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అవకతవకలను ఎండగట్టడంలో వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేసింది. ఆదివారం నాడు వైసీపీ నేత, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ.. లడ్డూ అంశంపై ఏకసభ్య కమిటీని నియమించడం సుప్రీంకోర్టును అవమానించడమేనని అన్నారు. "లడ్డూ తయారీకి వాడే నెయ్యిలో జంతు కొవ్వు లేదని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే సీబీఐ సిట్ బృందం స్పష్టంగా నివేదిక ఇచ్చింది. ఇప్పుడు ఆ నివేదికను ప్రశ్నించేలా కమిటీ వేయడం సర్వోన్నత న్యాయస్థానం గౌరవాన్ని సవాలు చేయడమే" అని ఆయన పేర్కొన్నారు. లడ్డూపై చంద్రబాబు, ఆయన అనుకూల మీడియా చేసిన తప్పుడు ప్రచారాన్ని కప్పిపుచ్చుకునేందుకే ఈ కమిటీని ఏర్పాటు చేశారని భూమన ఆరోపించారు. సిట్ నివేదికతో వారి వాదనలు తప్పని తేలడంతో, ముఖం చాటేసేందుకే ఈ ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ కమిటీ చట్టపరంగా నిలబడదని ఆయన అభిప్రాయపడ్డారు. "ఈ కుంభకోణానికి మూలమైన హెరిటేజ్, ఇందాపూర్, భోలే బాబా డెయిరీల మధ్య ఉన్న సంబంధాలను మేం బయటపెడుతూనే ఉంటాం" అని కరుణాకర్ రెడ్డి స్పష్టం చేశారు. మరోవైపు, పరకామణి చోరీ కేసులో కొత్తగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి, రాజకీయ ప్రత్యర్థులను ఇరికించేందుకు టీటీడీ ప్రయత్నిస్తోందని, ఇది కూడా ప్రజల దృష్టిని మళ్లించే కుట్రలో భాగమేనని ఆయన ఆరోపించారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలకు భయపడబోమని, న్యాయపోరాటం చేస్తామని భూమన తేల్చి చెప్పారు.

# జమ్మూలో ఎన్‌కౌంటర్.. ముగ్గురు టెర్రరిస్టులు హతం

అయితే దేశంలోకి ఉగ్రవాదుల ప్రవేశాన్ని ఎట్టిపరిస్థితుల్లో సహించేది లేదని అధికారులు అన్నారు. వేట కొనసాగుతుందని శాంతికి భంగం కలిగించే వారికి ఎట్టిపరిస్థితుల్లో భారత్‌లో ఆశ్రయం దొరకదని ఆర్మీ అధికారులు తెలిపారు. కాగా ఇటీవల జమ్మూకశ్మీర్ ప్రాంతంలో భద్రతా బలగాలు భద్రతను కట్టుదిట్టం చేశాయి. ఉగ్రవాదులను ఎట్టి పరిస్థితుల్లో సరిహద్దులోకి ప్రవేశించకుండా ఆధునాతన డ్రోన్లు నిఘా కెమెరాలతో పహారా కాస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముగ్గురు ముష్కరులను భద్రతా బలగాలు కాల్చి చంపినట్లు తెలుస్తోంది. అయితే ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ జమ్మూ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్లలో దాదాపు ఆరుగురు టెర్రరిస్టులు హతమైనట్లు అధికారులు తెలిపారు.

# నీటి హక్కులపై రాజీ ప్రసక్తే లేదు

అంశంపై బడ్జెట్ సమావేశాల్లో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, కేసీఆర్, హరీశ్ రావు తమ విలువైన సలహాలు ఇవ్వాలని సూచించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఈ వివాదాలు ఉండేవి కావని సీఎం చురకలంటించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రూ. 1.10 లక్షల కోట్లు ఖర్చు చేసి, ఇతర ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంతో కాళేశ్వరం నుంచి నీటిని లిఫ్ట్ చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. "కాళేశ్వరం వారి సొంత ఆస్తి కాదు. అది ప్రజల డబ్బు. దాన్ని వృథాగా పోనివ్వం. తిరిగి వినియోగంలోకి తెస్తాం" అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే నిపుణుల కమిటీని ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో ఎలాంటి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. నిధుల కొరత ఉన్నప్పటికీ, రెండేళ్లలో రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. దేవాదుల ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 6,000 కోట్ల నుంచి రూ. 18,500 కోట్లకు పెరిగిందన్నారు. భూసేకరణ కోసం జూన్ 2 లోగా రూ. 600 కోట్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. అన్ని ప్రాజెక్టుల భూసేకరణకు ప్రత్యేక కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసి, గ్రీన్ ఛానల్ ద్వారా పరిహారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, ఎంపీ బలరాం నాయక్, స్థానిక ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# ఏపీలో భారత్‌నెట్ విస్తరణ

అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. ఈ ప్రాజెక్టు కింద రాష్ట్రానికి రూ. 2,432 కోట్ల నిధులను కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సుమారు 5 లక్షల కుటుంబాలకు ఫైబర్ కనెక్షన్ల ద్వారా హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలను అందించడం. దీని అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ భారత్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఏపీబీఐఎల్) పేరుతో ఒక స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ)ను ఏర్పాటు చేసింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను డిజిటల్ భారత్ నిధి, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా సమకూర్చనున్నాయి. కేంద్రం తరఫున డిజిటల్ భారత్ నిధి అడ్మినిస్ట్రేటర్ శ్యామల్ మిశ్రా, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఐ అండ్ ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 13,426 గ్రామ పంచాయతీల్లో నెట్‌వర్క్‌ను విస్తరించనున్నారు. ఇందులో భాగంగా, ఇప్పటికే కింద ఉన్న 1,692 పంచాయతీల్లోని నెట్‌వర్క్‌ను ఆధునీకరిస్తారు. అలాగే, కింద 11,254 గ్రామాల్లో డిజిటల్ కనెక్టివిటీ పనులను పూర్తి చేస్తారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన 480 గ్రామ పంచాయతీలకు కూడా ఇంటర్నెట్ సౌకర్యం కల్పించనున్నారు. వీటికి అదనంగా, స్థానిక అవసరాలు, డిమాండ్‌ను బట్టి 3,942 గ్రామాల్లో లాస్ట్ మైల్ కనెక్టివిటీని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటారు. ప్రాజెక్టు సజావుగా సాగేందుకు అవసరమైన రైట్ ఆఫ్ వే అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పన, క్షేత్రస్థాయిలో సమన్వయం వంటి బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం చూసుకుంటుంది. గ్రామాల్లో హైస్పీడ్ ఇంటర్నెట్ అందుబాటులోకి రావడం ద్వారా డిజిటల్ గవర్నెన్స్, ఆన్‌లైన్ విద్య, టెలిమెడిసిన్, డిజిటల్ చెల్లింపులు, ఈ-గవర్నెన్స్ సేవలు మరింత పటిష్టంగా ప్రజలకు అందుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

# లొంగిపోయిన దేవ్‌జీ!

(మొదటి పేజీ తరువాయి)

ఇదే విషయాన్ని ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం, ఆ రాష్ట్ర హోంమంత్రి విజయ్‌శర్మ ఆదివారం రాయ్‌పూర్‌లో మీడియా సమావేశంలో వెల్లడించారు. దేవ్‌జీ, సంగ్రామ్ లొంగిపోయినట్లు తమకు సమాచారం ఉందన్నారు. అయితే ఈ వార్తలను తెలంగాణ పోలీసులు ఇంకా ధ్రువీకరించలేదు. కాగా, దేవ్‌జీ లొంగుబాటు వార్తల నేపథ్యంలో కేంద్రం సాగిస్తున్న ఆపరేషన్ కగార్2 లక్ష్యం ఇక నెరవేరినట్లేనన్న చర్చ నడుస్తోంది. తిప్పిరి తిరుపతి స్వస్థలం జగిత్యాల జిల్లా కోరుట్ల కాగా, రాజిరెడ్డి పెద్దపల్లి జిల్లాలోని మంథనికి చెందినవారు.

**మా ప్రభుత్వానికి భారీ విజయం**

'కేంద్ర హోంమంత్రి అమిత్ షా రణనీతి, ఛత్తీస్‌గఢ్ సీఎం అవలంబించిన విధానాల కారణంగా మావోయిస్టు పార్టీ మనుగడ అంతిమ దశకు చేరుకుంది. దేవ్‌జీ, సంగ్రామ్‌లు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలోని గడ్చిరోలి, అబూజ్‌మడ్ అడవుల్లో అనేక ఏళ్లుగా పనిచేస్తున్నారు. ఇద్దరు అగ్రనేతల లొంగుబాటు మా ప్రభుత్వానికి భారీ విజయం. కానీ వారిద్దరి కంటే మరో సీనియర్ నేత (ముప్పాళ్ల లక్మణరావు) ఇంకా అజ్ఞాతంలో ఉన్నారు. అయితే ఆయన వయోభారంతో ఉన్నారు. ఆయన ఎక్కడ ఉన్నారనే అంశంపై మాకు స్పష్టత లేదు. అగ్ర నాయకత్వంలో మరో నేత (మిసిర్ బెస్రా) జార్ఖండ్‌లో ఉన్నారు. అజ్ఞాతంలో ఉన్న ఇంకొందరు సాయుధ మావోయిస్టుల విషయంలో ఎలా ముందుకెళ్లాలనే అంశంపై చర్చ జరుగుతోంది. ఇప్పటికే కర్రెగుట్టల్లో భద్రతా దళాలు పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపడుతున్నాయి. ఈ ఆపరేషన్‌తో మాకు సత్ఫలితాలు వస్తున్నాయి. కర్రెగుట్టల్లో మావోయిస్టులు అమర్చిన 89 ఐఈడీలను నిర్వీర్యం చేశాం. మారిన పరిస్థితులను



గుర్తించి మిగిలిన వారు కూడా లొంగిపోతే మంచిది. ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చే నెల 31 నాటికి దేశంలో మావోయిస్టులు లేకుండా చేస్తాం'అని ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం విజయ్‌శర్మ చెప్పారు. మా కల నిజమైంది: తిరుపతి సోదరుడి కుమార్తె సుమ తిరుపతి లొంగుబాటు వార్త తెలియగానే ఆయన సోదరుడు గంగాధర్, ఆయన కుమార్తె సుమ, ఇతర బంధువులు స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. 'పెద్దనాన్న లొంగిపోవాలని ఎన్నో లేఖలు రాశాను. మా ఆవేదనను పెద్దనాన్న అర్థం చేసుకున్నారు. ఏళ్ల తరబడి అడవుల్లో ఉండి అణగారిన వర్గాల అభ్యున్నతికి పనిచేసిన ఆయన.. మా కోసం ఉద్యమాన్ని వీడి లొంగిపోయి వస్తున్నారన్న విషయం తెలియడంతో మా కల నిజమైందని సంబరపడుతున్నాం'అని సుమ చెప్పారు. అలాగే తిరుపతితో కలిసి కోరుట్ల జూనియర్ కళాశాలలో చదువుకున్న బక్కయ్య సైతం హర్షం వ్యక్తం చేశారు.

**విద్యార్థి దశ నుంచి విప్లవంలోకి..**

అణచివేతకు ఎదురొడ్డి.. భూస్వాముల దమనకాండను నిలదీసి.. అణగారిన వర్గాల్లో విప్లవ జ్వాలలు రగిలించిన తిప్పిరి తిరుపతి అలియాసదేవ్‌జీ రాడికల్ విద్యార్థి సంఘం నాయకుడి నుంచి మావో అగ్రనేతగా ఎదిగారు. కోరుట్లలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన తిరుపతి ఈ ప్రాంతంలో సామాన్య ప్రజానీకం భూస్వాముల అణచివేతపై చిన్నప్పటి నుంచే తిరుగుబావుటా ఎగురవేశారు. 1981లో పదో తరగతి నుంచే ఆయన రాడికల్ విద్యార్థి సంఘం వైపు ఆకర్షితులయ్యారు. ఆర్‌ఎస్‌యూ క్రియాశీల సభ్యుడిగా పనిచేశారు. కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివే సమయంలో విద్యార్థుల్లో విప్లవ భావాలను నూరిపోయడంలో కీలకపాత్ర పోషించారు. ఆ సమయంలో ఏబీవీపీ, ఆర్‌ఎస్‌యూ విద్యార్థి సంఘాల మధ్య గొడవలు, దాడులు తీవ్రమయ్యాయి. పోలీసులు రాడికల్ విద్యార్థి సంఘం నాయకులపై నిఘా పెంచారు. ఇంటర్ పాసైన తిరుపతి 198384 సమయంలో కరీంనగర్ ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో డిగ్రీలో చేరారు. అక్కడ ఆర్‌ఎస్‌యూ కార్యకలాపాల విస్తరణకు ప్రయత్నిస్తున్న క్రమంలో పోలీసుల నిఘా పెరగడంతో 1984 చివర్లో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. వరంగల్‌లోని నాటి రీజనల్ ఇంజనీరింగ్ కాలేజీ (ప్రస్తుత ఎన్‌ఐటీ)కి చెందిన నలుగురు విద్యార్థులు 1975లో సాయుధ రైతాంగ పోరాట నిర్మాణంలో పాలుపంచుకున్న క్రమంలో మెదక్ జిల్లా గిరాయిపల్లి వద్ద పోలీసులు వారిని చిత్రహింసలకు గురిచేసి చంపేశారు. ఈ ఘటనపై గద్దర్ రచించి పాడిన మల్లన్న, బీరప్ప, కొమురన్న ఒగ్గు కథ ప్రచారంలో తిరుపతి చురుకుగా పాల్గొన్నారు. 198283లో గిరాయిపల్లి ఒగ్గుకథను కోరుట్ల జూనియర్ కళాశాల మైదానంలో ప్రదర్శించగా ఒగ్గు కథలో బీరప్ప పాత్రను తిరుపతి పోషించారు. ఈ కథ వినేందుకు కోరుట్లవాసులే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు.

# స్నేహితుడే సూత్రధారి!



రచయిత, యూట్యూబర్ బొగ్గుల శ్రీనివాస్ మృతి కేసు మిస్టరీని తెలంగాణ పోలీసులు ఛేదించారు. ఆర్థిక లావాదేవీల విషయంలో తేడాలు రావడంతో ఆయన స్నేహితుడే కిరాయి హంతకులతో ఈ దారుణానికి పాల్పడినట్టు తేల్చారు. ప్రమాదంగా చిత్రీకరించేందుకు మృతదేహంతో ఉన్న కారును జలాశయంలోకి తోసేసినట్టు నిర్ధారించారు. ఈ కేసుకు సంబంధించి శ్రీనివాస్ స్నేహితుడితో పాటు మరో ముగ్గురు కిరాయి హంతకులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే, ఖమ్మం జిల్లాలోని పాలేరు జలాశయంలో ఫిబ్రవరి 14న ఓ కారు పడి ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ప్రమాదం జరిగిన సమయంలో డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి బయటకు దూకి పారిపోయినట్టు అక్కడి మత్స్యకారులు తెలిపారు. కారును బయటకు తీసి చూడగా, అందులో శ్రీనివాస్ (48) మృతదేహం లభించింది. ఆయన తలపై గాయాలు ఉండటంతో పోలీసులు అనుమానించారు. మృతుడు ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా అల్లూరు గ్రామ వాసిగా గుర్తించారు. 2014లో 'పవన్ కల్యాణ్ హఠావో-పాలిటిక్స్ బచావో' అనే పుస్తకం ప్రచురించిన తర్వాత శ్రీనివాస్ వార్తల్లోకి ఎక్కారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ఇది హత్యేనని అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు చేపట్టారు. వారం రోజుల్లోనే కేసులో పురోగతి సాధించి, శ్రీనివాస్ స్నేహితుడు వేణుమాధవరెడ్డితో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన పి. కోటేశ్వరరావు, షేక్ అబ్దుల్ హఫీజ్, అజ్మత్ అలీ అనే ముగ్గురు కిరాయి హంతకులను అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం, కొన్ని లావాదేవీల కోసం తన జీఎస్టీ ఖాతాను వాడుకునేందుకు శ్రీనివాస్... మాధవరెడ్డికి అనుమతి ఇచ్చారు. అయితే, జీఎస్టీ బకాయిల విషయంలో అధికారుల నుంచి శ్రీనివాస్‌కు నోటీసులు రావడంతో, ఒప్పందం ప్రకారం ఆ డబ్బు చెల్లించాలని మాధవరెడ్డిపై శ్రీనివాస్ ఒత్తిడి పెంచారు. దీంతో అతడిని అడ్డు తొలగించుకోవాలని మాధవరెడ్డి నిర్ణయించుకుని, కిరాయి హంతకులను రంగంలోకి దించాడు. విజయవాడ వెళుతున్న శ్రీనివాస్‌ను నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి వద్ద కారులోనే హత్య చేశారు. ఆ తర్వాత నేరాన్ని కప్పిపుచ్చేందుకు మృతదేహంతో సహా కారును పాలేరు జలాశయంలోకి తోసేసి ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి ఆదివారం మీడియాకు వెల్లడించారు.

# ఉద్రిక్తంగా 'చలో కామారెడ్డి'

లాలాపేట: బీజేపీ రాష్ట్ర నాయుకత్వం పిలుపు మేరకు ఆదివారం తలపెట్టిన చలో కామారెడ్డి ఉద్రిక్తంగా మారింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావుతోపాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. శనివారం రాత్రి నుంచే వారి ఇళ్ల వద్ద పోలీసులు మోహరించారు. బీజేపీ నాయకత్వాన్ని కామారెడ్డికి వెళ్లకుండా అడుగడుగునా పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. రాత్రి నుంచి హౌస్ అరెస్టులో ఉన్న రాంచందర్‌రావు ఎలాగైనా సరే కామారెడ్డి పర్యటనకు వెళ్లాల్సిందేనంటూ ఆదివారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వచ్చారు. అప్పటికే అక్కడ ఉన్న పోలీసులు రాంచందర్‌రావును అడ్డుకున్నారు. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తార్నాకకు చేరుకుని నిరసన చేపట్టారు. ఈ క్రమంలో కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు, బీజేపీ శ్రేణుల తోపులాటల మధ్య రాంచందర్‌రావుతోపాటు మరికొందరిని అరెస్టు చేసి బొల్లారం, గాంధీనగర్ పోలీసు స్టేషన్‌లకు తరలించారు. సికింద్రాబాద్ మహేంద్రహిల్స్‌లోని ఎమ్మెల్సీ మల్క కొమరయ్యను, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను హౌస్ అరెస్టు చేశారు. అదేవిధంగా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కూడా హౌస్ అరెస్టు చేశారు. ఈ అరెస్టులపై పార్టీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రౌడీ రాజ్యం నడుస్తోంది. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కాంగ్రెస్ నేతలు దాడులు చేయడమేంటి? కాంగ్రెస్, ఎంఐఎం కలిసి అరాచకాలు సృష్టిస్తున్నాయి. ఈ రెండు పార్టీలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం దుర్మార్గం. ఈ అరాచకాలను అడ్డుకోవడానికి బీజేపీ కార్యకర్తలు సిద్ధంకావాలి. కామారెడ్డిలో అగ్నికి ఆజ్యం పోసింది కాంగ్రెస్సే. బాన్సువాడలో 70 మందిని అక్రమంగా అరెస్ట్ చేశారు. రాళ్ల దాడి స్పష్టంగా కన్పిస్తున్నా చర్యల్లేవు.

**గొంతునొక్కే కుట్ర: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కే కుట్రను చేస్తోంది. నియంతృత్వంగా వ్యవహరించడంలో బీఆర్ఎస్ సర్కారును తలపిస్తోంది. రేవంత్ ప్రభుత్వం ఇలాగే వ్యవహరిస్తే కేసీఆర్‌కు పట్టిన గతే పడుతుంది.

**నిర్బంధ పాలన: ఎంపీ డీకే అరుణ**

రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని నిర్బంధ పాలన చేస్తోంది. సొంత పార్టీ ఎమ్మెల్యేకు సంఘీభావం తెలిపేందుకు బీజేపీ అధ్యక్షుడు వెళ్లడం నేరమా? బీజేపీని అణిచివేసే కుటిల ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోంది. అక్రమ అరెస్టులు చేసి, నిర్బంధించడం హేయమైన చర్య.

# ఆ సదస్సు టర్నింగ్ పాయింట్

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో భారత్ సాధించిన విజయాలు చూసి ప్రపంచ దేశాల అధినేతలు ఆశ్చర్యపోయారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఢిల్లీలో ఇటీవల నిర్వహించిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సును కీలక టర్నింగ్ పాయింట్‌గా పేర్కొన్నారు. భవిష్యత్తులో ఏఐ శక్తిని ఎలా వినియోగించుకోవాలో దిశా నిర్దేశం చేయడానికి సదస్సు తోడ్పడుతుందని తెలిపారు. 'మన్ కీ బాత్'లో భాగంగా ప్రధాని మోదీ ఆదివారం దేశ ప్రజలనుద్దేశించి రేడియోలో ప్రసంగించారు. ాూసదస్సుకు ప్రపంచ దేశాల అధినేతలు, పారిశ్రామిక వర్గాలు, సీఈఓలు, ఐఏ స్టార్టప్ రంగం ప్రతినిధులు, నవీన ఆవిష్కర్తలు హాజరయ్యారని గుర్తుచేశారు. "సదస్సులో ప్రధానంగా రెండు అంశాలు దేశాధినేతలను విశేషంగా ఆకట్టుకున్నాయి. వారు అమూల్ పాల కేంద్రాన్ని సందర్శించారు. రైతులు తమ పాడి పశువులను ఏఐ టెక్నాలజీతో నిరంతరం గమనించే తీరు పరిశీలించామన్నా రు. మన ప్రాచీన గ్రంథాలు, విజ్ఞానం, రాతప్రతులను ఏఐ టెక్నాలజీతో పరిరక్షిస్తున్న తీరు, వాటిని నేటి తరానికి అందిస్తున్న వైనాన్ని చూసి ఆశ్చర్యపడ్డారు. సదస్సులో మూడు 'మేడిన్ ఇండియా' ఏఐ మోడల్స్ విడుదల చేశాం" అని వివరించారు.

**డిజిటల్ మోసాలతో జాగ్రత్త**

ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, డిజిటల్ అరెస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మోదీ సూచించారు. "ప్రధానంగా వృద్ధులు ఈ మోసాల బారిన పడుతుండటం ఆందోళనకరం. బ్యాంకుల కేవైసీ ప్రక్రియను ఎప్పటికప్పుడు పూర్తి చేసుకోవాలి" అన్నారు. టీ20 క్రికెట్ ప్రపంచ కప్‌లో విదేశాల తరఫున భారతీయ మూలాలున్న ఆటగాళ్లు చాలామంది ఆడుతుండటం పట్ల ప్రధాని హర్షం వెలిబుచ్చారు. "భారతీయులు ఎక్కడికి వెళ్లినా తమ మూలాలు మర్చిపోరు. భారతీయతకు ఇదొక హాల్‌మార్క్. తాము నివసిస్తున్న దేశాల అభివృద్ధి కోసం శ్రమిస్తున్నారు. బానిసత్వ గుర్తులను శరవేగంగా వదిలించుకుంటున్నాం. భారతీయ సంస్కృతిని సూచించే చిహ్నాల విలువను గుర్తించడం మొదలైంది. ఈ దిశగా రాష్ట్రపతి భవన్ ముఖ్యమైన కార్యక్రమం నిర్వహిస్తోంది. సోమవారం రాజాజీ ఉత్సవ్ జరుగనుంది. రాష్ట్రపతి భవన్‌లో బ్రిటిష్ ఆర్కిటెక్ట్ ఎడ్విన్ లూటెన్స్ విగ్రహం స్థానంలో స్వతంత్ర భారత తొలి భారత గవర్నర్ జనరల్ సి.రాజగోపాలాచారి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. విద్యార్థులంటే పరీక్షల యోధులని మోదీ అన్నారు. "మీరు త్వరలో పరీక్షలు రాయనున్నారు. మార్కుల ఆధారంగా సత్తాను లెక్కగట్టలేరని తెలుసుకోండి.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



# కాళేశ్వరాన్ని కొనసాగిస్తాం



వరంగల్, :వేల కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును వినియోగంలోకి తీసుకొస్తామని సీఎం రేవంత్ స్పష్టంచేశారు. ప్రాజెక్ట్‌లో భాగమైన అన్నారం, మేడిగడ్డ, సుందిళ్ల బరాజ్‌లకు మరమ్మతులు చేసి, భవిష్యత్తులో ఎలాంటి ప్ర మాదాలు జరుగకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సాంకేతిక నిపుణులతో చ ర్చిస్తున్నామని, కమిటీలు, ఏజెన్సీలను నియమించామని చెప్పారు. ప్రాజెక్ట్‌పై పూర్తిస్థాయి అధ్యయనం చేస్తున్నామని వివరించారు. ఆదివారం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని దేవాదుల ప్రాజెక్ట్‌ను సీఎం రేవంత్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.తెలంగాణ ప్రత్యేకతలు

అంతకుముందు సమ్మక్క బరాజ్‌ను పరిశీలించి దేవాదులపై మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి సమీక్షించారు. అనంతరం దేవాదుల పంప్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి దేవాదులను పూర్తి చేసి, ఐదున్నర లక్ష ల ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తామని తెలిపారు. ఉత్తర తెలంగాణలోని అనేక ప్రాంతాలతోపాటు వరంగల్‌కు దేవాదుల నుంచే తాగునీరు అందుతుందని, ప్రాజెక్ట్‌పై ప్రణాళికతో ముందుకు పోతున్నామని చెప్పారు.

**భూసేకరణకు రూ.600 కోట్లు**

ఈ ఏడాది జూన్ 2లోగా దేవాదుల ప్రాజె క్టు నిర్మాణానికి కావాల్సిన భూసేకరణ కోసం రూ.600 కోట్ల నిధులను మంజూరు చేస్తామని సీఎం తెలిపారు. భూ సేకరణలో జాప్యం వల్ల ప్రాజెక్ట్ పనులు ఆగకూడదని స్పష్టంచేశా రు. అన్ని ప్రాజెక్టుల భూ సేకరణకు కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. నెల రోజు ల్లో దేవాదుల పంప్‌హౌస్‌కు మరమ్మతులు చేస్తామని వివరించారు. 80% పూర్తయిన ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం వద్ద నిధులు లేవని చెప్పారు. రామప్ప చెరువు నుంచి జంపన్న వాగుకు నీరందించే ప్రణాళికలపై నివేదిక అందించాలని ఆదేశించారు. 1994 నుంచి టీడీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు పదేండ్ల పాటు అధికారం ఇచ్చారని, 2034 దాకా తామే అధికారంలో ఉంటామని చెప్పుకొచ్చారు. విలేకరుల సమావేశంలో మంత్రు లు ఉత్తమ్, సీతక్క, పొంగులేటి, ఎంపీ కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. రూ.వేల కోట్లతో కట్టిన కాళేశ్వరంను వినియోగంలోకి తెస్తాం. ఏ బరాజ్‌నూ గాలికి వదిలేయం. సాంకేతిక నిపుణుల తో చర్చిస్తున్నాం. కమిటీలతో మాట్లాడుతున్నాం. ఏజెన్సీలను నియమించాం. భూమి మీద కనిపించేది మాత్రమే కుంగింది. నీటి లోపలి సమస్యలపై అధ్యయనం చేయాలి. ప్రజల సొమ్ముతో కట్టిన అన్నారం, మేడిగడ్డ, సుందిళ్ల బరాజ్‌లకు మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకొస్తాం.



## వినయ్ ఆధ్వర్యంలో 'చౌటుప్పల్' పురోగతి!

- నూతన వైస్ చైర్మన్‌కు ఘన సత్కారం
- చౌటుప్పల్ మండలం కాంగ్రెస్ పార్టీ నాయకుల అభినందనలు

**చౌటుప్పల్, ఫిబ్రవరి 22 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీ నూతన వైస్ చైర్మన్‌గా ఎన్నికైన గోశిక వినయ్ కుమార్ ను చౌటుప్పల్ మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. కాంగ్రెస్ నాయకుడు అర్థ వెంకట్ రెడ్డి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అర్థ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. గోశిక వినయ్ కుమార్ ఎన్నిక మున్సిపాలిటీ అభివృద్ధికి నూతన దిశానిర్దేశం చేస్తుందని పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ అన్ని రంగాల్లో పురోగతి సాధించి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాల ఏర్పాటు వంటి అంశాల్లో మరింత శ్రద్ధ తీసుకుని మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కంచర్లకుంట రామ్ రెడ్డి, కుందే మహేష్, సాయిరాం, శివ, పల్చం సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలకు మోడల్ పాఠశాల విద్యార్థుల ఎంపిక



**వలిగొండ, ఫిబ్రవరి 22 (తొలివెలుగు):** నల్గొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడా పోటీల్లో లోతుకుంట మోడల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఖో–ఖో విభాగంలో నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు శారీరక విద్యా ఉపాధ్యాయుడు జి. ఐలయ్య ఆదివారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఎ. లోకేష్ కుమార్, డి. ప్రశాంత్ కుమార్, పి. నిఖిల్, కె. ప్రణీత్ సాయి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. వారి ప్రతిభకు ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి, మండల విద్యాధికారి ఎస్. భాస్కర్, ఉప పరిశీలకుడు యుగంధర్ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రయిసున్నీస బేగం, పాఠశాల నిర్వహణ సంఘం అధ్యక్షురాలు పాక సరిత, గ్రామ సర్పంచ్ రాములు, ఉపాధ్యాయ బృందం అభినందించారు. రాష్ట్ర స్థాయిలో కూడా మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

## లింగోజిగూడెం ప్రగతే నా లక్ష్యం:

- ఉత్సాహభరితంగా పదవీ బాధ్యతల స్వీకరణ
- శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, మహిళలు
- కౌన్సిలర్‌గా బాధ్యతలు స్వీకరించిన పల్లె లావణ్య



**చౌటుప్పల్, ఫిబ్రవరి 22 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు లింగోజిగూడెం కౌన్సిలర్‌గా ఎన్నికైన పల్లె లావణ్య సురేందర్ రెడ్డి ఆదివారం వార్డు కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వార్డులో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. వార్డు ప్రజలు, మహిళలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై కౌన్సిలర్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వార్డులో పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో త్వరితగతిన పరిష్కరిస్తానని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనపై నమ్మకం ఉంచిన వార్డు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మునుగోడు ఎన్నికల ఇన్‌చార్జ్ పబ్బు రాజు గౌడ్, ఇన్‌చార్జి వెల్గ రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు బి.యన్. రెడ్డి, గుండు మల్లయ్య, కౌన్సిలర్లు హన్ను బాయ్, చింతల ఉమామహేశ్వరి సాయిలు, బత్తుల వాణి విప్లవ్ గౌడ్, మున్సిపల్ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్, తొర్పునూరి శ్రీకాంత్ గౌడ్, వార్డు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## నో హెల్మెట్.. నో పెట్రోల్!

- ప్రమాదాల కట్టడికి పటిష్ఠ చర్యలు
- నిర్వాహకులకు స్పష్టమైన ఆదేశాలు
- ముందుగా అవగాహన.. ఆపై పెట్రోల్
- ప్రజల సహకారం అనివార్యం
- జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 22 (తొలివెలుగు) :** రహదారి భద్రతను లక్ష్యంగా చేసుకుని యాదాద్రి భువనగిరి జిల్లా యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా ప్రోత్సహించేందుకు జిల్లా కలెక్టర్ హనుమంతరావు సరికొత్త ఆదేశాలు జారీ చేశారు. ఇకపై జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల్లో హెల్మెట్ లేకుండా వచ్చే వాహనదారులకు పెట్రోల్ సరఫరా నిలిపివేయనున్నట్లు స్పష్టం చేశారు. జిల్లాలో రహదారి ప్రమాదాలను కట్టడి చేసి వాహనదారుల ప్రాణాలకు రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు జిల్లాలోని అన్ని పెట్రోల్ బంక్ నిర్వాహకులకు సర్క్యులర్ జారీ చేశారు.

**అవగాహన కల్పించిన పిదపే పెట్రోల్...**

హెల్మెట్ లేకుండా పెట్రోల్ కోసం వచ్చే ద్విచక్ర వాహనదారులకు ముందుగా హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించి, తప్పనిసరిగా ధరించేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి పెట్రోల్ బంక్ ప్రాంగణంలో "హెల్మెట్ ధరించండి ప్రాణాలను రక్షించుకోండి" అనే సందేశంతో బోర్డులు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలని సూచించారు. బంక్ సిబ్బంది వాహనదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూనే నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని నిర్వాహకులకు స్పష్టం చేశారు.

హెల్మెట్ ధరించడం కేవలం జరిమానాల నుండి తప్పించుకోవడానికే కాకుండా కుటుంబానికి భరోసా కల్పించే చర్య అని ప్రతి పౌరుడు గుర్తుంచుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు**

నిబంధనలు అమలు విషయంలో ఎలాంటి రాజీ ఉండదని అధికారులు హెచ్చరించారు. హెల్మెట్ లేకుండా వచ్చే వారికి పెట్రోల్ ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ఆదేశాలను పాటించని పెట్రోల్ బంక్ యాజమాన్యాలపై, అలాగే నిబంధనలు అతిక్రమించే వాహనదారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు.

## సెలవు ఎరుగని 'గురువు'.. అరుదైన గౌరవం!

- విధుల్లో చేరిన నాటి నుంచి నిరంతర సేవలు
- రామలింగాచారి నిబద్ధతకు జిల్లా విద్యాశాఖ ప్రశంసలు
- ఘనంగా సత్కరించిన కాంప్లెక్స్ హెచ్ఎం మనోజ్ కుమార్

**రాజాపేట, ఫిబ్రవరి 22 (తొలివెలుగు):** రాజాపేట మండల కేంద్రంలోని హరిజనవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా కొనసాగుతున్న వనమాల రామలింగాచారిని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మనోజ్ కుమార్ ప్రత్యేకంగా సత్కరించి అభినందించారు. 2024 అక్టోబర్ 16న ఉపాధ్యాయునిగా సేవలో చేరిన రామలింగాచారి, రాజాపేట హరిజనవాడ ప్రాథమిక పాఠశాలకు నియమితులయ్యారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందిస్తూ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం లక్ష్యసాధన దిశగా కృషి చేస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. సేవలో చేరి 300 రోజులు దాటినా ఇప్పటివరకు ఒక్కరోజు కూడా సెలవు వినియోగించుకోకపోవడం విశేషం. ఈ సందర్భంగా మండల విద్యాధికారి చందా రమేష్ రామలింగాచారిని అభినందించారు. ప్రత్యేక కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మనోజ్ కుమార్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మండలంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, హరిజనవాడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆకుల భాస్కర్, రాజాపేట మండల జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు ఉప్పల రమేష్, రాజాపేట సర్పంచ్ కోయ మధు, వివిధ పార్టీల నాయకులు, యువకులు పాల్గొని రామలింగాచారిని అభినందించారు. ఆయన సేవాభావం అందరికీ ఆదర్శమని కొనియాడారు.





## ఆర్థిక సహాయం అందజేత

**వలిగొండ, ఫిబ్రవరి 22 (తొలివెలుగు):** వలిగొండ మండలం సుంకిశాల గ్రామానికి చెందిన ఈర్లపల్లి నర్సమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ పైళ్ల సంధ్యారాణి ఉపేందర్ రెడ్డి నర్సమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. నర్సమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మంగ జగన్, గ్రామ పెద్దలు మంగ బాలయ్య, కొండే కిష్టయ్య, పోలేపల్లి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## యువతకు 'జశ్వంత్' ఊతం!

- క్రీడాకారులకు క్రికెట్ బ్యాట్ పంపిణీ



**రాజపేట, ఫిబ్రవరి 22 (తొలివెలుగు):** మండల కేంద్రంలోని యువ క్రీడాకారులకు మాజీ ఎంపీటీసీ ఎర్ర గోకుల జశ్వంత్ ఆదివారం క్రికెట్ బ్యాట్‌ను అందజేశారు. మార్నింగ్ వాక్ గ్రూపు క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత క్రీడాకారులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. క్రీడాకారులకు అవసరమైన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు యువకులు, క్రీడాకారులు పాల్గొని జశ్వంత్‌కు ధన్యవాదాలు తెలిపారు.

## ప్రభుత్వ స్థలానికి ఫెన్సింగ్ వేస్తాం

పార్కు, విద్యా సంస్థల స్థాపనకే రాజరాజేశ్వరి కాలనీలోని ఆరు ఎకరాల ప్రభుత్వ భూమిని ఉపయోగిస్తామని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ జి.సృజన తెలిపారు. కొండాపూర్‌లోని రాజరాజేశ్వరి కాలనీలో విద్యా సంస్థలు, పార్కు అభివృద్ధికి కేటాయించిన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో సీఎంసీ కమిషనర్ సృజన, విద్యాశాఖ కమిషనర్ నవీన్ నికోలస్, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌లు ఆదివారం సంయుక్తంగా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. కాలనీ ఆమోదిత లే అవుట్ ప్రకారం ఐదు ఎకరాలు విద్యా సంస్థల స్థాపనకు, ఎకరం పార్కు అభివృద్ధికి కేటాయించినట్లు అధికారులు తెలిపారు.



# కౌన్సిలర్ వాణి విప్లవ్‌కు కాలనీవాసుల నీరాజనం!

- 13వ వార్డులో కౌన్సిలర్‌ను సన్మానించిన కాలనీవాసులు
- సమస్యల పరిష్కారమే లక్ష్యమని వెల్లడి

**చౌటుప్పల్, ఫిబ్రవరి 22 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ కుమార్ గౌడ్‌కు కృష్ణనగర్ - కంచరకుట్ల కాలనీ వాసులు ఘన సన్మానం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ తరపున కౌన్సిలర్‌గా గెలుపొందిన సందర్భంగా కాలనీవాసులు శాలువా కప్పి, పూలమాలలు వేసి, శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కృష్ణనగర్ - కంచరకుట్ల కాలనీ అభివృద్ధికి కౌన్సిలర్ కట్టుబడి పనిచేయాలని కోరారు. "మా కాలనీకి మీరు రావడం ఆనందంగా ఉంది. మీ గెలుపు మా కాలనీ అభివృద్ధికి దిక్సూచి కావాలి" అని కాలనీవాసులు అభిప్రాయపడ్డారు. కౌన్సిలర్ వాణి విప్లవ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, ప్రజల సమస్యలను ప్రాధాన్యంతో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేరెడ్డి మహేందర్ రెడ్డి, చెవగోని వెంకటేష్ గౌడ్, వర్కాల కుమార్ గౌడ్, మార్గం నరసింహ యాదవ్, గయ్యని జంగయ్య, మాల శివసాయి రెడ్డి, ఎంటర్ రమేష్, సభావతి నాగేష్, నేత కరెంటు రాజు, చందు నాయక్, మేరెడ్డి కృష్ణవేణి, వనం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


# తెలంగాణను ఏఐసీసీకి ఏటీఎంలా మార్చారు



హైదరాబాద్: సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రాన్ని ఏఐసీసీకి ఏటీఎంలా మార్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రెండేళ్లుగా తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్‌కు ఏటీఎంలా మారిందని తాము అనేకమార్లు హెచ్చరించిన విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డే స్వయంగా నిస్సిగ్గుగా ఒప్పుకున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర సంపదను కాంగ్రెస్ అధిష్టానానికి ధారపోస్తూ, తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ వీధుల్లో తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు. ఈ మేరకు కేటీఆర్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు ఇచ్చిన 420 హామీల అమలు విషయానికి వస్తే ప్రభుత్వం వద్ద రూపాయి నిధులు లేవని సాకులు చెబుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. అభివృద్ధికి నిధులు లేవంటున్న సర్కారు, కేవలం రెండేళ్ల కాలంలోనే రూ.3 లక్షల కోట్ల భారీ అప్పులు తెచ్చిందని, కానీ రాష్ట్రంలో కనీసం ఒక్క ఇటుక కూడా పేర్చిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. ప్రజల సొమ్మును ప్రజా ప్రయోజునాలకు వాడకుండా పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. మూసీ సుందరీకరణ పేరిట పేదల ఇళ్లను, లగచర్లలో గిరిజనుల భూములను, చివరకు హెచ్‌సీయూ విశ్వవిద్యాలయ భూములను కూడా వదలడం లేదని కేటీఆర్ విమర్శించారు. హిల్ట్ పాలసీ పేరిట పరిశ్రమల భూములను 'ఎనుముల బ్రదర్స్' పద్ధతి ప్రకారం లూటీ చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణను దోచుకోవడం, సొంతానికి దాచుకోవడం.. తన పదవిని కాపాడుకోవడం కోసం ఢిల్లీకి సంచులు మోయడమే రేవంత్ రెడ్డి ఏకైక ఎజెండా అని ధ్వజమెత్తారు. రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# భార్యను హత్యచేసి నగలు ఎత్తుకెళ్లిన భర్త

చేగుంట (తూప్రాన్): ఇల్లరికం వచ్చిన భర్త భార్యను హత్యుచేసి నగలను ఎత్తుకెళ్లాడు. ఈ సంఘటన మండల కేంద్రమైన చేగుంట స్టేషన్ రోడ్డులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంటకు చెందిన ఉప్పరి వరలక్ష్మి(35)కి, ఏపీ నెల్లూరుకు చెందిన త్రిమూర్తులుతో 2015లో వివాహమైంది. త్రిమూర్తులు చేగుంటకు ఇల్లరికం వచ్చి జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి సమయంలో వరలక్ష్మిని పారతో తలపై మోది హత్య చేశాడు. అనంతరం పుస్తెలతాడు, నగులు, డబ్బులు, సెల్‌ఫోన్ తీసుకొని పారిపోయాడు. గ్రామస్తుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి పంచనామా నిర్వహించారు. మృతురాలి బావ సాయిబాబా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వరలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



# నవమోహన కృష్ణుడై.. నరసింహుడు!

- పొన్న వాహన సేవలో గోవింద నామస్మరణ
- యాదాద్రి మాడవీధుల్లో ఆధ్యాత్మిక సందడి
- కిటకిటలాడిన యాదాద్రి.. భక్తుల జయజయధ్వానాలు
- వైభవంగా యాదాద్రి బ్రహ్మోత్సవాలు



**యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 22 (తొలివెలుగు):** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామివారు శ్రీకృష్ణ అలంకారంలో దర్శనమిచ్చి, సాయంత్రం పొన్న వాహనంపై ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులను పరవశింపజేశారు. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. వేదపండితుల వేదఘోషల మధ్య విశేష అభిషేకాలు, అర్చనలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పీతాంబరధారిగా, చేతిలో వేణువుతో గోపాలకృష్ణ స్వరూపంలో అలంకరించారు. తలపై నవరత్న కిరీటం, మెడలో పుష్పహారాలతో శ్రీకృష్ణుని రూపంలో లక్ష్మీనరసింహుడు దర్శనమివ్వడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పండితులు వివరించిన ప్రకారం, శ్రీకృష్ణ అలంకారం ద్వారా ధర్మరక్షణ, భక్తపరిరక్షణ, దుష్టశిక్షణ, శిష్టసంరక్షణ అనే సందేశం ప్రస్ఫుటమవుతుందని తెలిపారు. గోకులంలో గోపికలకు, గోపాలులకు ఆనందాన్ని పంచిన శ్రీకృష్ణునిలా యాదాద్రి క్షేత్రంలో స్వామివారు భక్తులకు అనుగ్రహం కురిపిస్తున్నారని పేర్కొన్నారు. సాయంత్రం పొన్న వాహన సేవ ఘనంగా నిర్వహించారు. పొన్న వృక్షం పవిత్రతకు, శుభసూచకానికి ప్రతీకగా భావించబడుతుంది. స్వామివారు సర్వాభరణ భూషితుడై పొన్న వాహనంపై మాడవీధుల్లో విహరించగా భక్తులు "గోవిందా నరసింహా" అంటూ నినాదాలు చేశారు. మహిళలు మంగళహారతులు సమర్పించగా, చిన్నారులు భజనలు ఆలపిస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. స్వామి - అమ్మవార్ల సేవకు ముందు చిన్నారులు నాట్య ప్రదర్శనలు, కోలాటాలతో ఆలయాన్ని మరింత శోభాయమానం చేశారు. ఆలయ వీధులు విద్యుత్ దీపాలు, పుష్పాలంకరణలతో సుందరంగా తీర్చిదిద్దబడ్డాయి. దేవస్థానం అధికారులు భక్తులకు త్రాగునీరు, ప్రసాదాల పంపిణీ, వైద్యశిబిరాలు, భద్రతా ఏర్పాట్లు సమకూర్చారు. పోలీసులు రాకపోకలను సులభతరం చేసేలా ట్రాఫిక్ నియంత్రణ చేపట్టారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజూ స్వామివారి వివిధ అవతారాల అలంకారాలు, వాహనసేవలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుతున్నాయి. శ్రీకృష్ణ అలంకారంపొన్న వాహనసేవ ప్రత్యేకతతో ఈ ఏడాది ఉత్సవాలకు మరింత ఉత్సాహం నెలకొంది. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ నరసింహమూర్తి, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, కార్యనిర్వాహక అధికారి భవానీ శంకర్, దేవాదాయ శాఖాధికారి దౌర్భాల భాస్కర్ శర్మ, సహాయ దేవాదాయ అధికారి రఘు సీతారామాచార్యులు, నటరాజు, ఆలయ ప్రధానార్చకులు కాందూరు వెంకటాచార్యులు, శ్రీనివాసాచార్యులు, సురేంద్రాచార్యులు, శ్రీధరాచార్యులు, అర్చకులు, వేదపండితులు, రుత్వికులు తదితరులు పాల్గొన్నారు.





# సభకు వెళ్లే పెద్దలెవరు?

హైదరాబాద్: ఈసారి రాష్ట్రం నుంచి పెద్దల సభ కు ఎవరు వెళ్తారన్న చర్చ ఇప్పుడు అధికార కాంగ్రెస్‌లో జోరుగా సాగుతోంది. ప్రస్తుతం రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న అభిషేక్ మను సింఘ్వి (కాంగ్రెస్), కేఆర్ సురేశ్‌రెడ్డి (బీఆర్ఎస్)ల పదవీ కాలం ఏప్రిల్ 9తో ముగియనున్న నేపథ్యంలో వారి స్థానంలో ఏర్పడే ఖాళీల భర్తీ కోసం కేంద్ర ఎన్నికల కమిషన్ ఇటీవల షెడ్యూల్ విడుదల చేసింది. ఈ షెడ్యూల్ ప్రకారం వచ్చే నెల 5లోపు నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంది. అసెంబ్లీలో బలాబలాల ప్రకారం ఈ రెండు స్థానాలు ఈసారి కాంగ్రెస్ పార్టీకి వచ్చే అవకాశాలుండటంతో అధికార పార్టీ ఎవరిని రాజ్యసభకు పంపుతుందన్నది చర్చనీయాంశమవుతోంది. అయితే, ఈ రెండింటిలో ఒకటి అధిష్టానం కోటాకు వెళ్లనుంది. తెలంగాణకు సంబంధించిన కీలక కేసుల్లో న్యాయవాదిగా ఉన్న ఆ పార్టీ నేత సింఘ్విని రాష్ట్రం నుంచి మరోమారు పెద్దల సభకు పంపే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇక, రెండో స్థానం కోసం తీవ్ర పోటీ నెలకొంది. రాష్ట్ర కాంగ్రెస్‌లోని పలువురు నేతలు ఎవరికి వారు రాజ్యసభ కోసం ప్రయత్నాలు చేసుకుంటుండగా, ఈసారి రెడ్డి, బీసీ, ఎస్టీ వర్గాల్లో ఒకరికి చాన్స్ ఉందనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రెండు దఫాలుగా ముగ్గురిని (రేణుకా చౌదరి, అనిల్‌కుమార్ యాదవ్, అభిషేక్ సింఘ్వి) రాజ్యసభకు పంపింది. ఈ జాబితాలో రేణుకా చౌదరి, అనిల్‌కుమార్ యాదవ్, అభిషేక్ సింఘ్వి ఉన్నారు. సింఘ్వికి రెన్యువల్ కావడం దాదాపు ఖరారు కాగా, రెండో సభ్యుడిగా రాష్ట్రం నుంచి రెడ్డి, బీసీ లేదంటే ఎస్టీ వర్గాల నేతల పేర్లను పరిగణనలోకి తీసుకునే అవకాశాలున్నాయి. ముఖ్యంగా మంత్రివర్గంలో స్థానం లేని లంబాడా సామాజిక వర్గానికి ఈ సీటు కేటాయించే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో గణనీయ సంఖ్యలో ఓటర్లున్న లంబాడా సామాజిక వర్గానికి మంత్రివర్గంలో స్థానం లేకపోవడం, ఇప్పటివరకు నల్లగొండ జిల్లాకు చెందిన శంకర్‌నాయక్‌ను మాత్రమే ఎమ్మెల్సీగా నియమించడం, కార్పొరేషన్ చైర్మన్ల విషయంలో పెద్దగా ప్రాధాన్యం కల్పించని నేపథ్యంలో ఈసారి బంజారా నాయకుడిని పెద్దల సభకు పంపే విషయాన్ని తీవ్రంగా పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఈ కోటాలో తెలంగాణ



ఉద్యమకారుడు, ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ చైర్మన్, ప్రస్తుత ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. తెలంగాణ ఉద్యమకారుడిగా ఆయనకు అటు బంజారా సామాజిక వర్గంలోనూ, ఇటు రాజకీయ వర్గాల్లోనూ గుర్తింపు కూడా ఉంది. సీఎం రేవంత్ ఆశీస్సులు కూడా ఆయనకున్నాయని, రాహుల్ కోటరీలో తనకున్న సంబంధాలతో ఈసారి తనకు అవకాశం ఇవ్వాలని బెల్లయ్య ఢిల్లీలో ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇదే సామాజికవర్గం నుంచి మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ పేరు కూడా వినిపిస్తోంది. సామాజిక సమీకరణల్లో భాగంగా బీసీలకు మరో అవకాశం ఇచ్చే అంశాన్నీ కాంగ్రెస్ పరిశీలిస్తోంది. ఈ జాబితాలో మాజీ ఎంపీ వి.హనుమంతరావు, అధిష్టానంతో సన్నిహిత సంబంధాలున్న టీపీసీసీ ప్రచార కమిటీ మాజీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ పేర్లు వినిపిస్తున్నాయి. మరోవైపు దేశవ్యాప్తంగా సామాజిక న్యాయం అంశాన్ని ఎజెండాగా చేసుకుని వెళుతున్న కాంగ్రెస్... బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు సముచిత ప్రాధాన్యం ఇస్తోందని, ఇప్పటికే పలు కీలక స్థానాల్లో ఆయా వర్గాల నేతలను నియమించిన నేపథ్యంలో ఈసారి రాజ్యసభకు అగ్రవర్ణాలకు చెందిన నాయకులను పంపుతారనే చర్చ కూడా జరుగుతోంది. ఇందులో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతల పేర్లు తెరపైకి వస్తున్నాయి. రేవంత్‌కు అత్యంత సన్నిహితుడు, ఆయన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి పేరు ఈ జాబితాలో ప్రముఖంగా వినిపిస్తోంది. ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి కూడా ఇప్పటికే ఢిల్లీ పెద్దలను కలిసి తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఇక, రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి కూడా తన సేవలకు గుర్తింపుగా పెద్దల సభకు పంపుతారని ఆశిస్తున్నారు. జగిత్యాల నియోజకవర్గ రాజకీయ పరిణామాల్లో అసంతృప్తితో ఉన్న సీనియర్ నేత టి.జీవన్‌రెడ్డి పేరును కూడా పార్టీ పరిశీలిస్తున్నట్టు సమాచారం. వీరితో పాటు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, ఉప రాష్ట్రపతిగా ఇండియా కూటమి నుంచి పోటీ చేసిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేరు కూడా వినిపిస్తున్నా ఆయన రాజకీయ అడుగు వేస్తారా అన్నది తేలాల్సి ఉంది.

తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..




## బిట్‌కాయిన్ సరికొత్త రికార్డ్.. ఆల్‌టైమ్ గరిష్టాలకు చేరిన ధర

అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా.. పెట్టుబడిదారులలో ఆందోళన మొదలైంది. డాలర్ విలువ రోజురోజుకి తగ్గుముఖం పట్టింది. ఈ తరుణంలో బిట్‌కాయిన్ వాల్యూ ఆదివారం ఆల్‌టైమ్ గరిష్ట స్థాయికి చేరుకొని.. 1,25,000 డాలర్ల మార్కును దాటింది. అంటే భారతీయ కరెన్సీ ప్రకారం ఒక బిట్‌కాయిన్ విలువ సుమారు రూ. 1.08 కోట్లు. ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టోకరెన్సీ అయిన బిట్‌కాయిన్ విలువ తాజాగా 1,25,689 డాలర్లకు చేరుకుంది. ఆగస్టు 14న నెలకొల్పిన 1,24,514 రికార్డును సైతం.. ఇప్పుడు అధిగమించింది. ప్రస్తుత పరిస్థితులు బిట్‌కాయిన్ విలువను అమాంతం పెంచే అవకాశం ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు. అంతే కాకుండా అమెరికా స్టాక్‌లలో లాభాలు, బిట్‌కాయిన్ లింక్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లోకి ఇన్‌ఫ్లోలు పెరిగాయి. ఇటీవల ప్రారంభమైన ప్రభుత్వ షట్‌డౌన్.. డబ్బును సురక్షితమైన ఆస్తులలో పెట్టుబడి పెట్టేలా చేసింది. మార్కెట్ వర్గాలు దీనిని ‘డీబేస్‌మెంట్ ట్రేడ్’ అని పిలుస్తున్నారు. “ఈక్విటీలు, బంగారం, పోకీమాన్ కార్డుల వంటి సేకరణలతో సహా అనేక ఆస్తులు ఆల్ టైమ్ గరిష్టాలను తాకాయి. డాలర్ విలువ తగ్గడం.. బిట్‌కాయిన్ విలువ పెరగడంలో ఆశ్చర్యం ఏమీ లేదు” అని క్రిప్టో ప్రైమ్ బ్రోకరేజ్ సంస్థ ఫాల్కన్‌ఎక్స్ మార్కెట్ల కో హెడ్ జాషువా లిమ్ అన్నారు.సాధారణంగా అక్టోబర్ నెల బిట్‌కాయిన్‌కు అనుకూలమైనది.. దీనిని “అప్‌టోబర్” అని మార్కెట్ నిపుణులు పిలుచుకుంటారు. గత కొన్నేళ్లుగా బిట్‌కాయిన్ పెరుగుతూనే ఉంది. రానున్న రోజుల్లో మరింత పెరుగుతుందని చెప్పడంలో కూడా ఎలాంటి సందేహం లేదని చెబుతున్నారు.

## లగ్జరీ సౌకర్యాలతో హైదరాబాద్‌లో కొత్త ప్రాజెక్ట్



హైదరబాద్‌లో లగ్జరీ ప్రాపర్టీల మార్కెట్‌లో కొత్త ప్రమాణాలను సృష్టించడమే లక్ష్యంగా కొన్ని ప్రాజెక్ట్‌లు వెలుస్తున్నట్లు మకుటా డెవలపర్స్ ఛైర్మన్ జనార్ధన్ కొంపల్లి అన్నారు. ‘మకుటా తరంగ’ పేరుతో హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో విలాసవంతమైన రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో అత్యంత కీలకమైన ప్రాంతాల్లో ఇలాంటి ప్రాజెక్ట్‌లు ప్రత్యేకంగా నిలుస్తున్నట్లు చెప్పారు. మెట్రో కనెక్టివిటీ, రిటైల్ అవుట్లెట్లు, విద్యా సంస్థలు, ఆధునిక వైద్య సదుపాయాలు ఉన్నందుకు ఇలాంటి ప్రాజెక్ట్‌లకు ఆదరణ పెరుగుతున్నట్లు తెలిపారు. ఇదే అదనుగా ప్రీమియం రెసిడెన్షియల్ మార్కెట్‌లో తమ స్థానాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు.

## బీమా కమీషన్ తగ్గిపోతోంది.. ఏజెంట్ల ఆందోళన



హైదరాబాద్: అందరికీ బీమాను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో వ్యక్తిగత జీవిత బీమా, ఆరోగ్య బీమా పాలసీలపై వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ)ని ప్రభుత్వం సున్నా శాతానికి చేర్చింది. సెప్టెంబరు 22 నుంచి అమల్లోకి వచ్చిన ఈ మార్పుల కారణంగా, బీమా ప్రీమియాలపై సగటున 15-18% భారం తగ్గి, పాలసీదారులకు ప్రయోజనం కలుగుతోంది. ఇదే సమయంలో బీమా సంస్థలకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) వెసులుబాటు రద్దయ్యింది. దీంతో తమ లాభాల్లో కొంత వదులుకోవాల్సి వస్తున్నందున, కంపెనీలు ప్రత్యామ్నాయాన్ని ఆలోచిస్తున్నాయి. బీమా సలహాదార్లు, ఏజెంట్లు, కార్పొరేట్ బ్రోకర్లకు ఇచ్చే కమీషన్‌లో కోత విధించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇప్పటికే కొన్ని కంపెనీలు అక్టోబరు 1 నుంచి విక్రయించే రిటెయిల్ పాలసీలపై కమీషన్‌ను 15-18% వరకు తగ్గించాయి. టర్మ్ పాలసీలు, యూనిట్ ఆధారిత బీమా పాలసీలు (యులిప్), యాన్యుటీ పథకాలపైనా ఈ కమీషన్ కోత వర్తింపచేస్తున్నాయి. దీంతో బీమా సలహాదారులు తమ ఆదాయంలో గణనీయమైన కోత పడుతోందని పేర్కొంటున్నారు. జనరల్ ఇన్సూరెన్స్ ఏజెంట్ల ఫెడరేషన్ ఇంటిగ్రేటెడ్ (జీఐఏఎఫ్ఐ) ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తోంది. కమీషన్ తగ్గించడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో బీమా పాలసీల విక్రయానికి చిన్న ఏజెంట్లు ఆసక్తి చూపరని, ఇది బీమా విస్తృతికి అవరోధంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. బీమా నియంత్రణ సంస్థ, ఆర్థిక మంత్రిత్వ శాఖను సంప్రదించి, బీమా సంస్థల నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా చేయాలని కోరుతోంది.

## రూ.10 కోట్ల రోల్స్‌రాయిస్ కంటే రూ.10 లక్షల కారే నయం కదా!



రూ.కోట్లు పెట్టి కొన్న వస్తువులు కూడా కొన్ని సందర్భాల్లో పనికిరాకుండా పోతుంటాయి. సాధారణ సగటు వస్తువులే మేలనిపిస్తాయి. అలాంటి సంఘటనే ఇది. సుమారు రూ.10 కోట్ల ధర ఉండే రోల్స్‌రాయిస్ ) కారు.. వరద నీటిలో చిక్కుకుని ఇక నావల్ల కాదంటూ ముందుకెళ్లకుండా మొరాయిస్తే.. రూ.10 లక్షల లోపుండే మామూలు కార్లు రయ్‌మంటూ దూసుకెళ్లాయి. కోల్‌కతాలో అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి. నగరంలోని చాలా ప్రాంతాలు నీట మునిగిపోయాయి. రోడ్లపై పెద్ద ఎత్తున వరద నీరు నిలిచి ఉంది. ఈ క్రమంలో ఓ రోల్స్ రాయిస్ కారు ఆ వరద నీటిలో నిలిచిపోయిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియోలో టాటా వాహనంలో ప్రయాణిస్తున్న ఒక వాహనదారుడు రోల్స్ రాయిస్ ఘోస్ట్ కారు వరద నీటిలో ఎలా చిక్కుకుపోయిందో పేర్కొన్నారు. రూ .10 కోట్లకు పైగా విలువైన లగ్జరీ కారు కంటే తన రూ .10 లక్షల టాటా కారే నయం అంటూ ఈ క్లిప్‌లో ఆ వాహనదారుడు వ్యాఖ్యానించారు. ఈ ఘటన దక్షిణ కోల్‌కతాలోని బాలీగంజ్ ప్రాంతంలో చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. వైరల్‌గా మారిన ఈ వీడియోపై పలువురు ఇన్‌స్టాగ్రామ్ యూజర్లు ప్రతిస్పందించారు. రోల్స్ రాయిస్ లగ్జరీ కారని, నీటితో నిండిన వీధుల్లో నడపడానికి ఉద్దేశించినది కాదని కొందరు వ్యాఖ్యానించగా, కోల్‌కతా నగర రోడ్ల దుస్థితిని మరికొంతమంది ప్రశ్నిస్తూ కామెంట్‌లు పెట్టారు.

## ఇక ఫోకస్ అంతా 6జీపైనే.. 8 నుంచి ఇండియా మొబైల్ కాంగ్రెస్

ఈ నెల 8 నుంచి 11 వరకు న్యూఢిల్లీలో నిర్వహించే ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ) 2025 సదస్సులో ప్రధానంగా 6జీ వ్యవస్థను అభివృద్ధి చేయడం, భాగస్వామ్యాలను ఏర్పాటు చేసుకోవడంపై దృష్టి పెట్టనున్నారు. విశ్వసనీయ భాగస్వామిగా అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన భారత్, 6జీ వ్యవస్థను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించగలదని డిజిటల్ టెక్నాలజీ ప్లాట్‌ఫాం ఐఎంసీ సీఈవో పి. రామకృష్ణ తెలిపారు. ’6జీ వ్యవస్థకు ప్రధానమైన అంశాలను అనుసంధానం చేయగలిగే కీలక ప్లాట్‌ఫాంగా ఇండియా మొబైల్ కాంగ్రెస్ ఎదుగుతోంది. ఇందులో భారత్‌తో పాటు యూరప్, బ్రిటన్, అమెరికా, జపాన్, దక్షిణ కొరియా తదితర దేశాల నుంచి పరిశ్రమకు చెందిన సీనియర్ నేతలు, నిపుణులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు’ అని ఆయన పేర్కొన్నారు. 6జీ సిపోజియంలో టెక్నాలజీ దిగ్గజాలతో పాటు ఐఐటీ, అంతర్జాతీయ యూనివర్సిటీల్లాంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల నుంచి విద్యావేత్తలు పాల్గోనున్నారు. 6జీకి సంబంధించిన టెక్నాలజీలు, కృత్రిమ మేథ నెట్‌వర్క్‌లు, స్పెక్ట్రం క్రమబద్ధీకరణ తదితర అంశాలపై అత్యున్నత స్థాయిలో చర్చలు జరపనున్నట్లు రామకృష్ణ చెప్పారు. 7,000 మంది పైగా గ్లోబల్ ప్రతినిధులు, 800 మంది వక్తలు, 150 దేశాల నుంచి 400 మంది ఎగ్జిబిటర్లు ఇందులో పాల్గొంటారని అంచనా. 6జీ గ్లోబల్ రేసుకు భారత్ సారథ్యం వహించనుందని సెల్యులార్ ఆపరేటర్స్ సమాఖ్య సీవోఏఐ డైరెక్టర్ జనరల్ ఎస్‌పీ కొచ్చర్ తెలిపారు.

# డేటా సెంటర్లకు ఏఐ కళ

### మెట్రో నగరాల్లో భారీ పెట్టుబడి
### ఓపెన్‌ఏఐ కేంద్రం హైదరాబాద్‌కే?




దేశంలో హైఎండ్ కంప్యూటింగ్ సొల్యూషన్స్ (హెచ్‌సీఎస్) విభాగంలో ఓఈఎం (ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మానుఫ్యాక్చరర్) సేవలు అందించే సంస్థ నెట్‌వెబ్ టెక్నాలజీస్‌కు ఎన్విడియా నుంచి రూ,1,734 కోట్ల ఆర్డరు వచ్చింది. ఈ2ఈ నెట్‌వర్క్స్ లిమిటెడ్ అనే మరో సంస్థకు కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ - ఐటీ మంత్రిత్వ శాఖ నుంచి రూ.177 కోట్ల విలువైన జీపీయూ రిసోర్సెస్ ఆర్డరు లభించింది.ఏఐ విభాగంలో ఎంతో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నట్లు, ఏఐ మౌలిక వసతులు మనదేశంలో విస్తరిస్తున్నట్లు స్పష్టం చేయటానికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. మనదేశంలో ఏఐ (కృత్రిమ మేధ) కంప్యూటింగ్ సామర్థ్యం విస్తరించేందుకు, ఇండియా ఏఐ మిషన్ కింద సొంత ఏఐ సిస్టమ్స్ ఆవిష్కరించటానికి కృషి జరుగుతోంది. దీనికి ఎన్విడియా నుంచి లభించిన ఆర్డర్ ఎంతగానో దోహదపడుతుందని నెట్‌వెబ్ టెక్నాలజీస్ అంటోంది.

**‘ఎడ్జ్’ వెనుకంజ...**

డేటా సెంటర్ల విస్తరణ విషయంలో విశ్లేషకుల అంచనాలు తలకిందులయ్యాయి. క్లౌడ్ సేవల మార్కెట్‌ను పరిగణనలోకి తీసుకుని ఎడ్జ్ డేటా సెంటర్లు ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరిస్తాయని అంచనా వేశారు. చిన్న డేటా సెంటర్లను (10 మెగావాట్ల కంటే తక్కువ సామర్థ్యం కలిగినవి) ఎడ్జ్ డేటా సెంటర్లుగా పరిగణిస్తారు. ద్వితీయ శ్రేణి నగరాలతో పాటు చిన్న పట్టణాల్లో సైతం ఎడ్జ్ డేటా సెంటర్లు వస్తాయని భావించారు. విశాఖపట్నం, విజయవాడ, వరంగల్, తిరుపతి, నిజామాబాద్, కర్నూలు వంటి నగరాల్లోనూ ఇటువంటి డేటా సెంటర్లు ఏర్పాటయ్యే రోజు ఎంతో దూరంలో లేదని అంచనా వేశారు. కానీ సాంకేతిక రంగంలో వస్తున్న అనూహ్య మార్పులతో ఈ అంచనాలు తలకిందులు అయ్యాయి. ఏఐ విస్తరణ, ఇతర సాంకేతిక ఆవిష్కరణలతో భారీస్థాయి డేటా సెంటర్లకే గిరాకీ లభిస్తోంది. దీంతో ముంబయి, హైదరాబాద్, చెన్నై నగరాల్లో ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్లు, టెక్నాలజీ కంపెనీల అవసరాలకు అనుగుణంగా భారీస్థాయి డేటా సెంటర్లు విస్తరిస్తున్నాయి.

**విదేశీ దిగ్గజాల పాగా..**

మన దేశానికి చెందిన సంస్థలతో పాటు విదేశాలకు చెందిన టెక్ దిగ్గజాలు ఇక్కడ భారీ స్థాయిలో డేటా సెంటర్లు ఏర్పాటు చేయటానికి సిద్ధపడుతున్నాయి. విశాఖపట్నంలో గూగుల్ 6 బిలియన్ డాలర్ల పెట్టుబడితో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్న విషయం విదితమే. ఈ విభాగంలో ఇతర సంస్థలను సైతం ఆకర్షించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. క్లౌడ్, ఏఐ మౌలిక వసతుల కోసం 3 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనున్నట్లు మైక్రోసాఫ్ట్ కొంతకాలం క్రితం వెల్లడించింది. ‘చాట్‌జీపీటీ’ని రూపొందించిన ఓపెన్‌ఏఐ అనే సంస్థ మన దేశంలో 1 గిగావాట్ సామర్థ్యం కల అతిపెద్ద ఏఐ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఇటీవల ప్రకటించింది.



## సరికొత్త బ్రిక్స్‌టన్ బైక్: దీని గురించి తెలుసా?

బ్రిక్స్‌టన్ మోటార్ సైకిల్స్.. తన మొట్టమొదటి మిడ్-కెపాసిటీ అడ్వెంచర్ మోటార్ సైకిల్ అయిన ‘స్టోర్ 500’(శీతీ 500)ను ఆస్ట్రియాలోని తన ప్రధాన కార్యాలయంలో అధికారికంగా ఆవిష్కరించింది. ఈ బైక్ కోసం ప్రీ-బుకింగ్‌లు డిసెంబర్ 2025లో ప్రారంభమవుతాయి. ఆ తరువాత డెలివరీ ఎప్పుడనే విషయాన్ని సంస్థ వెల్లడించనుంది. ముందుగా బుక్ చేసుకున్నవారికి.. ముందుగా డెలివరీలు జరుగుతాయని సంస్థ వెల్లడించింది. బ్రిక్స్‌టన్ స్టోర్ 500 బైక్.. 486 సీసీ లిక్విడ్-కూల్డ్, ప్యారలల్-ట్విన్ ఇంజిన్ ద్వారా 8500 ఆర్పీఎం వద్ద 47.6 బీహెచ్పీ పవర్, 6750 ఆర్పీఎం వద్ద, 43 న్యూటన్ మీటర్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది. ఇది 6-స్పీడ్ గేర్‌బాక్స్‌తో లభిస్తుంది. ఈ బైక్ యూఎస్డీ ఫ్రంట్ ఫోర్క్, సెంట్రల్ రియర్ మోనోషాక్ వంటి సస్పెన్షన్ సెటప్ పొందుతుంది. డ్యూయల్ ఛానల్ ఏబీఎస్‌తో డిస్క్ బ్రేక్‌లు ఈ బైకులో ఉంటాయి. ఫీచర్స్ విషయానికి వస్తే.. కనెక్టివిటీ ఎంపికలతో కూడిన 5 ఇంచెస్ టీఎఫ్‌టీ డిస్‌ప్లే, ఎల్ఈడీ డీఆర్ఎల్ %డ% ఇండికేటర్స్, ఇంటర్నల్ ఫాగ్ ల్యాంప్స్, యూఎస్బీ ఛార్జింగ్ పోర్ట్ మొదలైనవి ఈ బైకులో ఉన్నాయి. అయితే కంపెనీ ఈ బైకుని ఇండియన్ మార్కెట్లో లాంచ్ చేస్తుందా?, లేదా అనేది వెల్లడించలేదు.




# దక్షిణాఫ్రికాకు దాసోహం

అహ్మదాబాద్: టి20 ప్రపంచకప్‌లో భారత్ వరుస విజయాల జైత్రయాత్రకు బ్రేక్ పడింది. 2024 టి20 ప్రపంచకప్ టోర్నీ నుంచి మొదలు పెడితే వరుసగా 13 మ్యాచ్‌లు నెగ్గిన భారత్ గెలుపు పరుగు ఎట్టకేలకు ఆగింది. 'సూపర్8' దశలో భాగంగా ఆదివారం జరిగిన గ్రూప్1 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 76 పరుగుల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డేవిడ్ మిల్లర్ (35 బంతుల్లో 63; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధసెంచరీ సాధించగా, బ్రెవిస్ (29 బంతుల్లో 45; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) అండగా నిలిచాడు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 51 బంతుల్లోనే 97 పరుగులు జోడించగా, చివర్లో ట్రిస్టన్ స్టబ్స్ (24 బంతుల్లో 44 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు) దూకుడు ప్రదర్శించాడు. అనంతరం భారత్ 18.5 ఓవర్లలో 111 పరుగులకే కుప్పకూలింది. శివమ్ దూబే (37 బంతుల్లో 42; 1 ఫోర్, 3 సిక్స్‌లు) మినహా అంతా విఫలమయ్యారు. మార్కో యాన్సెన్ (4/22) భారత్‌ను దెబ్బ తీయగా, కేశవ్ మహరాజ్‌కు 3 వికెట్లు దక్కాయి. భారత్ తమ తర్వాతి సూపర్ ఎయిట్స్ మ్యాచ్‌లో గురువారం చెన్నైలో జింబాబ్వేతో తలపడుతుంది.

**కీలక భాగస్వామ్యం...**

బుమ్రా, అర్ష్ దీప్ పదునైన బౌలింగ్ కారణంగా దక్షిణాఫ్రికాకు శుభారంభం దక్కలేదు. బుమ్రా తన వరుస ఓవర్లో డికాక్ (6), రికెల్టన్ (7)లను వెనక్కి పంపించగా, ఈ రెండు వికెట్ల మధ్య ఓవర్లో మార్క్‌రమ్ (4)ను అర్ష్ దీప్ అవుట్ చేశాడు. దాంతో సఫారీ టీమ్ 20/3తో కష్టాల్లో పడింది. ఈ స్థితిలో బ్రెవిస్, మిల్లర్ కలిసి దూకుడుగా ఆడుతూ జట్టును ఆదుకున్నారు. పవర్‌ప్లేలో జట్టు 41 పరుగులు చేసింది.

ఆరు బంతుల వ్యవధిలో నాలుగు ఫోర్లు బాది మిల్లర్ జోరు ప్రదర్శించగా, వరుణ్ ఓవర్లో బ్రెవిస్ వరుసగా 4, 6 కొట్టాడు. అదే ఓవర్లో మిల్లర్ కూడా సిక్స్ బాదడంతో 17 పరుగులు వచ్చాయి. దూబే ఓవర్లోనూ ఫోర్, సిక్స్ బాదిన బ్రెవిస్ అతని తర్వాతి ఓవర్లో అవుట్ కావడంతో ఎట్టకేలకు భారీ భాగస్వామ్యానికి తెర పడింది. మరోవైపు 26 బంతుల్లో మిల్లర్ హాఫ్ సెంచరీ పూర్తయింది. 15 ఓవర్ల తర్వాత 144/4తో సఫారీ జట్టు 200 స్కోరుపై కన్నేసింది. అయితే ఇక్కడ ప్రత్యర్థిని కట్టడి చేయడంలో టీమిండియా సఫలమైంది. బుమ్రా చక్కటి బౌలింగ్‌తో తన రెండు ఓవర్లలో 8 పరుగులే ఇవ్వడంతో 1619 మధ్య మొత్తం 23 పరుగులే రాగా, దక్షిణాఫ్రికా 3 వికెట్లు కూడా చేజార్చుకుంది. కానీ పాండ్యా వేసిన ఆఖరి ఓవర్లో స్టబ్స్ ఫోర్, 2 సిక్స్‌లు సహా 20 పరుగులు రాబట్టాడు.

**టపటపా...**

భారీ ఛేదనలో ఏ దశలోనూ భారత్ గెలిచేలా కనిపించలేదు. తొలి ఓవర్లోనే ఇషాన్ కిషన్ (0) అవుటైన తర్వాత తర్వాతి ఓవర్ తొలి బంతికే తిలక్ వర్మ (1) వెనుదిరిగాడు. ఎట్టకేలకు వరల్డ్ కప్‌లో ఖాతా తెరిచిన అభిషేక్ శర్మ (15) కూడా క్రీజ్‌లో ఉన్నంతసేపు తడబడ్డాడు. 6 ఓవర్లు ముగిసేసరికి జట్టు స్కోరు 31/3. బ్యాటింగ్‌లో ముందుగా వచ్చిన వాషింగ్టన్ సుందర్ (11) ప్రభావం చూపలేకపోగా, కెప్టెన్ సూర్యకుమార్ (22 బంతుల్లో 18; 2 ఫోర్లు) ఇన్నింగ్స్ కూడా పేలవంగా ముగిసింది. హార్దిక్ పాండ్యా (18), రింకూ సింగ్ (0) ఒకే స్కోరు వద్ద అవుట్ కావడంతో భారత్ గెలుపు ఆశలు కోల్పోయింది.

# స్పిన్‌కు ఎదురొడ్డి... స్పిన్‌తోనే పడగొట్టి...

పల్లెకెలె: సమష్టి ప్రదర్శనతో సత్తా చాటిన ఇంగ్లండ్ జట్టు టి20 ప్రపంచకప్ 'సూపర్8'లో శుభారంభం చేసింది. ఆదివారం గ్రూప్2లో భాగంగా జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 51 పరుగుల తేడాతో ఆతిథ్య శ్రీలంకను బోల్తా కొట్టించింది. గ్రూప్ దశలో పడుతూ లేస్తూ సాగిన ఇంగ్లండ్... 'సూపర్ ఎయిట్'లో సాధికారిక విజయం ఖాతాలో వేసుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 146 పరుగులు చేసింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (40 బంతుల్లో 62; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. జోస్ బట్లర్ (7), జాకబ్ బెథెల్ (3), టామ్ బాంటన్ (6), కెప్టెన్ హ్యారీ బ్రూక్ (14), స్యామ్ కరన్ (11), డాసన్ (6) విఫలమయ్యారు. స్పిన్ ఆల్‌రౌండర్ విల్ జాక్స్ (21; 4 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. సొంతగడ్డపై శ్రీలంక బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో ఇంగ్లండ్ బ్యాటర్లు పూర్తిగా తడబడ్డారు. ఒక్క సాల్ట్ తప్ప మిగిలిన వాళ్లెవరూ భారీ షాట్‌లు ఆడలేకపోయారు. లంక బౌలర్లలో లెఫ్టార్మ్ స్పిన్నర్ దునిత్ వెల్లలాగె 3 వికెట్లు పడగొట్టగా... మధుషనక, తీక్షణ చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనలో శ్రీలంక పూర్తిగా తడబడింది. 16.4 ఓవర్లలో 95 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ షనక (24 బంతుల్లో 30; 1 ఫోర్, 2 సిక్స్‌లు) ఒక్కడే పోరాడగా... తక్కిన వాళ్లంతా విఫలమయ్యారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' విల్ జాక్స్ 3 వికెట్లు తీయగా... ఆర్చర్, డాసన్, ఆదిల్ రషీద్ తలా రెండు వికెట్లు పడగొట్టారు.

**సాల్ట్ ఒక్కడే...**

ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ సాల్ట్ ఒక్కడే దూకుడు కనబర్చాడు. లంక బౌలర్ల ధాటికి సహచర బ్యాటర్లంతా పెవిలియన్‌కు చేరుతున్నా... సాల్ట్ మాత్రం తనదైన శైలిలో షాట్‌లు ఆడాడు. వరల్డ్‌కప్ తొలి పోరులో నేపాల్ చేతిలో 'చావుతప్పి కన్ను లొట్టబోయినట్లు' గెలిచిన ఇంగ్లండ్...'సూపర్ 8'లోనూ అలాంటి అనుభవమే చవిచూసేలా కనిపించింది. అయితే సాల్ట్ మెరుపులకు బౌలర్ల సహకారం తోడవడంతో ... ఇంగ్లండ్ పని సులువైంది. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో 15 బౌండరీలు మాత్రమే నమోదైతే... శ్రీలంక కేవలం 12 బౌండరీలకే పరిమితమైంది.

**పవర్ ప్లేలోనే 34/5...**

ఓ మాదిరి లక్ష్యఛేదనలో లంక తడబడింది. ఇంగ్లండ్ బౌలర్లు ఆర్చర్, జాక్స్ ధాటికి... ఆరు ఓవర్లు ముగిసేసరికి 34/5తో పీకల్లోతు కష్టాల్లో పడింది. నిసాంక (9), కమిల్ (6), కుశాల్ మెండిస్ (4), పవన్ రత్నాయకే (0), దునిత్ వెల్లలాగె (10) ఇలా ఒకరి తర్వాత ఒకరు పెవిలియన్‌కు వరుస కట్టారు. కెప్టెన్ షనక కాస్త పోరాడే ప్రయత్నం చేసినా... ఇంగ్లండ్ బౌలర్ల ధాటికి వికెట్ల పతనం అలాగే కొనసాగింది. దీంతో శ్రీలంక లక్ష్యానికి దూరంగా నిలిచిపోయింది. తదుపరి 'సూపర్8' మ్యాచ్‌ల్లో మంగళవారం పాకిస్తాన్‌తో ఇంగ్లండ్; బుధవారం న్యూజిలాండ్‌తో శ్రీలంక తలపడతాయి.






# వెటకారం వద్దు

రష్మిక మందన్న తన ప్రేమికుడు విజయ్ దేవరకొండను పెళ్లాడుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ప్రీ వెడ్డింగ్ వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. రాజస్థాన్ ఉదయ్ పూర్ కోటలో ఈ వివాహం జరగనుందని వార్తలొస్తున్నాయి. ఇలాంటి సమయంలో నటి మాజీ ప్రియుడు రక్షిత్ శెట్టి స్నేహితుడు ప్రమోద్ శెట్టి చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిగ్ గా మారాయి. తనకు ఇంకా ఆమె పెళ్లి ఆహ్వానం అందలేదని, ఒకవేళ వస్తే వెళ్తానని, అయితే తమను పిలవదని కూడా తెలుసని వెటకారంగా మాట్లాడాడు. ఇక రష్మిక- రక్షిత్ జంట నిశ్చితార్థం తర్వాత బ్రేకప్ గురించి మాట్లాడుతూ.. రక్షిత్ శెట్టి చాక్లెట్ తింటూ బాధపడే చిన్న పిల్లాడు కాదు అని వ్యాఖ్యానించాడు. రష్మిక తన కెరీర్ తొలి కన్నడ సినిమా కిరిక్ పార్టీలో రక్షిత్, ప్రమోద్ శెట్టిలతో కలిసి నటించింది. ఆ సమయంలోనే రక్షిత్ తో ఆమె ప్రేమలో పడింది. అయితే నిశ్చితార్థం అనంతరం కెరీర్ కోసం తన నిర్ణయం మార్చుకోవడం చర్చకు వచ్చింది. ప్రమోద్ వ్యాఖ్యలు రష్మిక అభిమానులకు, నెటిజన్లకు ఆగ్రహం తెప్పించాయి. గతంలో ముగిసిపోయిన విషయాలను ఇప్పుడే గుర్తు చేయాల్సిన అవసరం ఏమిటని నిలదీస్తున్నారు.



## అవమానాలే అవకాశాలుగా..

అందం, అభినయంతో దక్షిణాది అడియన్స్ హృదయాల్లో స్థానం సంపాదించుకున్న నటి ఐశ్వర్య రాజేశ్. పలు తమిళ చిత్రాల్లో మెప్పించిన ఈ అమ్మడు. తెలుగమ్మాయి అయినప్పటికీ మొదట్లో ఆమెను ఎవరూ పట్టించుకోలేదు. తెలుగు సినిమాల్లో ఒక్క ఛాన్స్ కోసం ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నానని చెప్పింది. ఇక్కడ అవకాశాలు రాకపోవడంతో తమిళంలో ఎన్నో సూపర్ హిట్ చిత్రాలలో నటించి తనదైన ముద్ర వేసినట్లు తెలిపింది. తన కెరీర్ మొదట్లో ఇండస్ట్రీలో ఎదుర్కొన్న చేదు అనుభవాలను గురించి పంచుకుంది. హీరోయిన్ అంటే తప్పనిసరిగా అందంగా ఉండాలని.. తెల్లగా ఉండాలని.. జీరో సైజ్ ఉండాలనే రూల్స్ అప్పట్లో ఎక్కువగా ఉండేవని గుర్తుచేశారు. నువ్వు హీరోయిన్ కాదు.. ఆమె ఫ్రెండ్ క్యారెక్టర్ చేయడానికి కూడా పనికిరావు అంటూ తనను ముఖం మీదే అవమానించే వారని చెప్పింది. ఆ మాటలు విన్నప్పుడు ఎంతో బాధపడ్డానని.. హీరోయిన్ కావాలనే ఆశల కంటే.. అవమానాలే తనలో కొత్త పట్టుదలను పెంచాయని చెప్పుకొచ్చింది.